క్లుప్తంగా

శబరిమలకు అయ్యప్ప స్వాములు



చార్మినార్: పాతబస్తీ రాజన్నబావి లక్ష్మీనగర్‌లోని భద్రాది రామ అష్టలక్ష్మి సమేత బాలాజీ ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి ధరించి శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. నల్ల కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఇరుముడి పూజా కార్యక్రమంలో క్రాంతి పంతులు పాల్గొని 27 మంది అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టి శబరి యాత్రకు బయలుదేరి వెళ్లారు.

సందడిగా 'దర్పణ్'



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ రవీంద్రభారతి పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దర్పణ్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పుల్లా కార్తిక్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయలక్ష్మితో పాటు రవీంద్రభారతి విద్యాసంస్థల డీన్ ప్రియామనీష్, పాఠశాల ప్రిన్సిపాల్ నూరీన్ ఫాతీమాతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభినందనలు



ఆంజనేయులుగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ ఆంజనేయులుగౌడ్‌ను గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. క్రీడా అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్‌గౌడ్, యూసుఫ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఏసీపీ కార్యాలయం ఆవరణలో వీధి దీపాలు లేక చిమ్మచీకటిగా మారింది. ఇదే ఆవరణలో రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయం సాగుతుంది. కొన్ని రోజులుగా ఏసీపీ కార్యాలయం భవనం వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. విషయం తెలుసుకున్న శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు సాయి మాలిక్, టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నరేష్‌లు శనివారం జీహెచ్‌ఎంసీ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

రాజేంద్రనగర్: బీసీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ముకురా చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. శనివారం మంత్రి శ్రీనివా'ౕ‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి బీసీ ఉద్యోగుల సమస్యల గురించి వివరించారు. సీఎం కేసీఆర్‌కు బీసీ ఉద్యోగుల సమస్యలను వివరించి తగు చర్యలు తీసుకునేలా చేయాలని ఆయనను కోరామన్నారు. మంత్రికి పూల మొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రమా, వర్సిటీ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భిక్షపతి, కార్యవర్గ సభ్యులు సంతోష్, సాగర్ తదితరులున్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

బంజారాహిల్స్: రౌడీషీటర్లు వివాదాల జోలికి వెళ్లకుండా తమ పని తాము చేసుకుంటూ సత్ప్రవర్తనతో మెలగాలని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం జూబ్లీహిల్స్‌పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తాము నివసిస్తున్న ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణానికి భగ్నం కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సివిల్ వివాదాల్లో తలదూర్చవద్దని హితవు పలికారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న పాండురతన్, నర్సింహారెడ్డి, పాండుయాదవ్



బీజేపీ జెండా ఎగరవేసిన ఎన్నికల ఇన్‌చార్జ్ అశోక్‌కుమార్, పార్టీ ఇన్‌చార్జ్ అమర్ సింగ్



బీజేపీ నాయకులతో కార్పొరేటర్ కరుణాకర్ తదితరులు

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగరవేయడానికి ప్రతిఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కార్వాన్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జ్ కొత్త అశోక్‌కుమార్‌గౌడ్, నియోజకవర్గం ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎస్‌బీఏ గార్డెన్‌లో కార్వాన్ నియోజకవర్గం బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. కార్వాన్ కన్వీనర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటైంది. ముందుగా జెండాను ఆవిష్కరించి భారతమాత చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వర్చువల్ సమావేశం జరిగింది. అనంతరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలన్నారు. జేపీ నడ్డా సందేశాన్ని గడప గడపకు వెళ్లి తెలియజేయాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ముళ్లే భిక్షపతి, దర్పల్లి నర్సిములు, మునేందర్, సతీష్ బిడ్లా, అన్ను యాదవ్, రాజేందర్ డెగాన్, వెంకటేష్ యాదవ్, యోగిరాజ్ సింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

అబిడ్స్: బూత్ కార్యకర్తలే బీజేపీకి కొండంత బలమని గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం పాలక్ పాండు రతన్, ప్రభారి కొప్పుల నర్సింహారెడ్డి, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు పాండు యాదవ్ పేర్కొన్నారు. శనివారం రహింపురాలో గోషామహల్ నియోజకర్గంలోని బూత్ కమిటీ స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. రాబోయే ఎన్నికల్లో తమ బూత్ కమిటీల కార్యకర్తలే కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపుతారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి అక్రమాలను ప్రజలకు వివరించాలని వారన్నారు. గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కృష్ణ, రఘునందన్‌యాదవ్, కార్పొరేటర్లు శశికళ కృష్ణ, శంకర్ యాదవ్, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

గోల్కొండ: వచ్చే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ అన్నారు. శనివారం మెహిదీపట్నం పుల్లారెడ్డి కళాశాల ఆడిటోరియంలో నాంపల్లి నియోజకవర్గం బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం జరిగింది. ఈ వర్చ్యువల్ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్రలో ఎండగట్టారని, దీంతో రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలు ప్రజలకు బాగా తెలిశాయన్నారు. సీఎం కేసీఆర్ నియంతగా వ్యవహరిస్తున్నారన్న విషయం ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. దీంతో ప్రజలు బీజేపీవైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కాగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో గెలవడం ఖామన్నారు. బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ అమర్‌సింగ్, నాంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకుడు అశ్వత్థామరెడ్డి, సునీల్‌యాదవ్, నామ యదగిరి, అశ్వామోది పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ సమావేశం

చార్మినార్: దూద్‌బౌలిలోని మున్నూరు కాపులో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా నిర్వహించిన వర్చువల్ బూత్ కమిటీ సమావేశానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సబ్ కా సాత్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్ కార్యక్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఆఫ్సర్ పాషాతో పాటు పాశం సురేందర్, ఉమామహేంద్ర, సురేందర్, అశోక్ గాంధీ, హనుమంత్ రావు, డాక్టర్ సక్సేనా, తౌసిఫ్ అబ్బాస్, సయ్యద్ సర్వార్ హుస్సేన్, దేవిసింగ్, నికత్ ఫాతిమా, నిత్య పారిక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జంగల్ సఫారి సైన్స్ ఫెస్ట్



జంతువుల వేషధారణలో చిన్నారులు

జియాగూడ: జియాగూడ గౌతమ్ మోడల్ స్కూల్‌లో జంగల్ సఫారి సైన్స్ ఫెస్ట్ ప్రదర్శనలు అబ్బురపరిచాయి. పాఠశాలకు చెందిన విద్యార్థులు సుమారు 102 రకాలను ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ మేరకు శనివారం జియాగూడ గౌతమ్ మోడల్ స్కూల్‌లో జంగల్ సఫారి సైన్స్ ఫెస్ట్ కార్యక్రమం ఏర్పాటైంది. ఇందులో స్కేరీరూమ్, హిమాలయాస్, ఆయుర్వేద, ఎర్లిమెన్, సర్వే ఆఫ్ ఇండియా, గ్లోబల్ వార్మింగ్, హైడ్రో ఎలక్ట్రిసిటీ, హ్యూమెన్ బాడీ, ఫుల్ టెక్నాలజీ, ప్లానెట్ స్పాట్స్, జూపార్క్, సోలార్ ఎనర్జీ, జంతువుల అవశేషాలు తదితరవి విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జైస్వాల్ సభ రాష్ట్రీయ అధ్యక్షుడు రాజేందర్ ప్రసాద్ జైస్వాల్, స్కూల్ ప్రెసిడెంట్ రాజు, ఉపాధ్యక్షులు సంజయ్ కౌలే, కరస్పాండెంట్ ఉమేష్ ఓట్కర్, ట్రెజరర్ సురేష్ యాదవ్, ప్రిన్సిపాల్ రవీణా జైస్వాల్, టీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, బీజేపీ నాయకులు రమేష్ చౌగ్లే, మదిర సత్యనారాయణ, స్థానిక పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శనలను తిలకించారు.



సైన్స్ ఫెస్ట్‌ను ప్రారంభించిన స్కూల్ యాజమాన్యం

ఘనంగా 'డైమండ్ జూబ్లీ' వార్షికోత్సవం



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: 'డైమండ్ జూబ్లీ' ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో డిస్నీల్యాండ్ పేరిట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. నేటితరం చిన్నారులను విద్యతో పాటు సాంస్కృతిక రంగాలలోనూ రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆగాఖాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ నూరుద్దీ దామిని, ఆలియా ప్రవీణ్, ప్రిన్సిపల్ సుజాత పాల్గొన్నారు.

నేడు 'రవీంద్రభారతి' వార్షికోత్సవం

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్, ఐ.ఎస్.సదన్ రవీంద్రభారతి పాఠశాల వార్షికోత్సవాన్ని ఈ నెల 8న పబ్లిక్ గార్డెన్‌లోని లలితా కళాతోరణంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిఆరు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు పాల్గొంటారని తెలిపారు.

దోమల బెడద

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకొన్న దోమల బెడదతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని ఖాజీపురా, హిమ్మత్‌పురా తదితర ప్రాంతాల్లో దోమల బెడద విపరీతంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. దోమల బెడదతో తాము అనారోగ్యాలకు గురవుతున్నామని వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారుల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని దోమల నివారణకు బస్తీల్లో ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

రాజేంద్రనగర్: బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ కార్మికుడు గంజాయిని విక్రయిస్తుండగా రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి 480 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ప్రోలే హల్దర్ బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. బండ్లగూడ టైమ్స్ స్కూల్ ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా చేరాడు. స్వగ్రామం నుంచి వచ్చే సమయంలో తన వెంట కిలో గంజాయిని తీసుకువచ్చాడు. గంజాయి సేవించే ప్రోలే హల్దర్ విధులు నిర్వహిస్తు గంజాయి సేవించేవాడు. స్థానికులు గంజాయికి అలవాటు పడ్డవారు తమకు గంజాయి కావాలని కోరడంతో వారి నుంచి డబ్బు తీసుకొని విక్రయించడం ప్రారంభించాడు. ఇది లాభసాటిగా ఉండడంతో గంజాయిని విక్రయించడం ప్రారంభించాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు శనివారం ఉదయం అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న 480 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకోని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందర్శకులను ఆకట్టుకుంటున్న జాయ్ రైడ్ రైలు



మాట్లాడుతున్న కొత్తపల్లి ప్రేమ్‌కుమార్‌రెడ్డి

అబిడ్స్: ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకులకు జాయ్ రైడ్ రైలు ఆకట్టుకుంటుందని కన్వీనర్ కొత్తపల్లి ప్రేమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాయ్ రైడ్ రైలు పనితీరును పరిశీలించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ ప్రారంభమైనప్పటి నుంచి సందర్శకుల కోసం రైలు పట్టాలతో కూడిన రైలును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే పదేళ్ల క్రితం పట్టాల నుంచి మాటిమాటికి రైలు దిగిపోయి సమస్యలను సృష్టిస్తుందన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని దాని స్థానంలో టైర్లతో ఉన్న రైలును ప్రవేశపెట్టినట్లె తెలిపారు. ఈ రైలును ముఖ్యంగా చిన్నారుల కోసం ప్రవేశపెట్టారన్నారు. ఈ రైలు ఎగ్జిబిషన్ కొనసాగే వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతిరోజూ వంద ట్రిప్పుల వరకు రైలు నడుస్తుందన్నారు. రైలులో దాదాపు 50 మంది వరకు ఎక్కే సామర్థ్యం ఉందన్నారు. రాజేందర్ కోడె, జానకి రామ్, రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

ఈ నీరు తాగేదెలా..?



కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీరు

చార్మినార్: మొఘల్‌పురా డివిజన్‌లోని మొఘల్‌పురా దర్గా లేన్ తదితర ప్రాంతాల్లో కుళాయిల ద్వారా మురుగు నీరు సరఫరా అవుతుండటంతో ఆయా ప్రాంతాలకు చెందిన స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఈ విషయం సంబంధిత జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదిగా తాము ఈ దుర్వాసనతో కూడిన మురుగు నీరు తాగలేక అనారోగ్యాలకు గురవుతున్నామని.. ఇప్పటికే చిన్నారులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల ద్వారా మురుగు నీరు సరఫరా అవుతున్న జలమండలి అధికారులు పట్టించుకోకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి మురుగు నీటి సరఫరాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాభివృద్ధికి కృషి

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో శనివారం జరిగిన అయ్యప్ప స్వామి పడిపూజలో ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధితో పాటు ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ -18 ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు సముచిత ప్రాధాన్యం: మంత్రి తలసాని



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు సముచిత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శనివారం నిజాం కళాశాల మైదానంలో మేరు క్రికెట్ లీగ్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు పలు ప్రోత్సహకాలు అందించినట్లు గుర్తుచేశారు. క్రీడలు సామాజిక వర్గాలవారిని ఒకే థాటిపైకి తీసుకు వచ్చేందుకు ఎంతగానో దోహద పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, మేరు సంఘం నాయకులు గిరిధర్, లక్ష్మీనారాయణ, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ, ఆసిఫ్‌నగర్ మండలాలకు చెందిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చెందిన ఎన్నో సంక్షేమ పథకాల గురించి తెలియని వారు దరఖాస్తు చేసుకోవడం లేదన్నారు. అయితే తాను బస్తీలు, కాలనీలలో పాదయాత్రలు చేస్తూ సంక్షేమ పథకాల గురించి అర్హులైన వారికి తెలియజేస్తున్నానన్నారు. వారిచే దరఖాస్తు చేయించి మంజూరయ్యేలా తనవంతు కృషి చేస్తున్నానన్నారు. దళితబంధు పథకాల ద్వారా ఎన్నో కుటుంబాలకు ఉపాధి లభించిందన్నారు. అదేవిధంగా మైనార్టీల కోసం ప్రభుత్వం సబ్సిడీపై ఔత్సాహిక యువకులకు రుణాలిస్తుందన్నారు. ఈనెల 9వ తేదీ వరకు మైనార్టీలు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. లబ్ధిదారుల గుర్తింపులో పారదర్శకత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా మహిళలు వ్యాపారం కోసం గ్రూపులుగా ఏర్పడి పొదుపు సంఘాలను తయారు చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

అలరించిన నృత్యాభినయం



నాంపల్లి: అభినయవాణి నృత్యానికేతన్ ఆధ్వర్యంలో ప్రముఖ నర్తకీమణి శశి చల్లా తాడేపల్లి కూచిపూడి నృత్య ప్రదర్శన అలరింపజేసింది. శుక్రవారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ఆమె చక్కగా నర్తించి ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. గూగుల్ ఇండియా కంపెనీలో ఉన్నతస్థాయి అధికారిణిగా రెండు దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న శశి చల్లా తాడేపల్లి యుక్త వయస్సులోనే కూచిపూడి నృత్యం పట్ల ఆకర్షితులయ్యారు. కూచిపూడిలో ఓనమాలు నేర్చుకుని తొలి ప్రదర్శనగా విలక్షణమైన అంశాలతో వేదికపై నర్తించారు. ప్రముఖ నృత్య గురువు చావలి బాల త్రిపుర సుందరి నట్టువాంగ పర్యవేక్షణలో సాగిన శశి చల్లా నృత్య దర్శనను వీక్షించేందుకు హైదరాబాదు విశ్వవిద్యాలయం నృత్య విభాగం ప్రొఫెసర్ అనురాధ తడకమళ్ల, మైక్రోసాఫ్ట్ ఇంజినీరింగ్ విభాగం వీసీ చారుమతి శ్రీనివాసన్ హాజరయ్యారు. అనంతరం గురు సత్కారం జరిగింది.

నుమాయిష్‌లో బీఎస్‌ఎన్‌ఎల్ స్టాల్ ప్రారంభం



స్టాల్‌ను ప్రారంభిస్తున్న చాగంటి శ్రీనివాస్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలంగాణ సర్కిల్ సీజీఎం చాగంటి శ్రీనివాస్ తెలిపారు. శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న నుమాయిష్‌లో బీఎస్ఎన్ఎల్ స్టాల్‌ను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఎగ్జిబిషన్ మైదానానికి వచ్చే సందర్శకుల కోసం ఉచిత వైఫై సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఎస్ఎన్ఎల్ అధికారులు, ఎగ్జిబిషన్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై ప్రవచనాలు



తిరుప్పావై ప్రవచనాలు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చార్మినార్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సహకారంతో ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. పూసల బస్తీలోని పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేద పండితులు కొమాండూరి శ్రీధరాచార్యులు ఇచ్చే ప్రవచనాలు కార్యక్రమానికి భక్తులు హాజరవుతున్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 7:30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 14వ తేదీ వరకు ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు కొనసాగుతాయని శ్రీధరాచార్యులు తెలిపారు. 5 వేల ఏళ్ల నుంచి తిరుప్పావై ప్రవచనాలను ధనుర్మాసంలో శాస్త్రీయ విధంగా అన్ని ఆలయాల్లో నిర్వహించబడుతుందన్నారు. ఇందులో భాగంగా పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రతిరోజు ఈ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని శ్రీధరాచార్యులు తెలిపారు.


టీచర్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న ప్రొ. హరగోపాల్, లక్ష్మీనారాయణ

సుల్తాన్‌బజార్: నిజామాబాద్ జిల్లా కోటగిరి హైస్కూల్‌లో పనిచేస్తున్న తెలుగు టీచర్ మల్లికార్జున్‌పై బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఉద్దేశపూర్వకంగా దాడిచేసి, తన విధులకు ఆటంకం కలిగించారని వారిని వెంటనే అరెస్టు చేయాలని శనివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొ. లక్ష్మీనారాయణ, ప్రొ. చక్రధర్‌రావు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ.. వినాయక చవితికి చందా అడిగితే ఇవ్వని టీచర్ మల్లికార్జున్‌పై బీజేపీ విశ్వహిందూ పరిషత్ నాయకులు ఉద్దేశపూర్వకంగా అన్యమత ప్రచారం చేస్తున్నాడు అని, దేవుళ్లను కించపరుస్తున్నాడనే నెపంతో తనను అవమానకరంగా హింసించారని పేర్కొన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సోమన్న మాట్లాడుతూ.. ఉపాధ్యాయ హక్కులను హరించే విధంగా మతోన్మాదం మూకలు వ్యవహరించడం చట్టవిరుద్ధమని, ఉపాధ్యాయ సమాజాన్ని ఏర్పాటు చేయడంలో ఉపాధ్యాయుడు కీలకమైన పాత్ర పోషిస్తాడన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యాయులు గడ్డం శ్యామ్, జన్నరావు రాజేశ్వర్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీటిపారుదల శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రాజేందర్

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన నీటిపారుదల శాఖలో(ఇరిగేషన్) పని చేసే ఉద్యోగులకు సమస్యలు ఉన్నాయని, పరిష్కారానికి నోచుకోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ అన్నారు. శనివారం నీటిపారుదల శాఖ కేంద్ర ఫోరం నూతన సంవత్సరం కేలండర్ ఆవిష్కరణ సభ నాంపల్లిలోని టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్‌తో కలిసి నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోరం కేంద్ర అధ్యక్షుడు మారం జగదీష్, ప్రధాన కార్యదర్శి నజీర్ అహ్మద్, సహాధ్యక్షులు కృష్ణమూర్తి, మెదక్ జిల్లా అధ్యక్షులు నరేంద్ర, హైదరాబాదు జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, మహేష్, ఇతర టీఎన్జీఓ నేతలు పాల్గొన్నారు.